డిఎం అండ్ హెచ్‌ఓగా సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా నూతన వైద్య ఆరోగ్యశాఖ అధికారిణిగా డాక్టర్ సుధారాణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో మౌళిక వసతుల కల్పిన రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం తీసుకొన్ని వైద్య ఆరోగ్యశాఖలోని కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డిఎం హెచ్‌ఓగా పనిచేస్తూ ప్రమోషన్‌పై చిత్తూరు డిఎం హెచ్‌ఓగా వచ్చినట్లు తెలిపారు.

చంద్రబాబు పాలనలో అన్నీ మంచి రోజులే..

- రాక్షస పాలన నుంచి ఏపీకి విముక్తి కలిగింది..
- సిఎం భార్యగా కాదు.. టీడీపీ కార్యకర్తగా కుప్పం వచ్చా..
- 4వ రోజు కుప్పం పర్యటనలో మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి

రామకుప్పంలో మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి

ప్రజాశక్తి - రామకుప్పం, వి కోట

నిత్యం ప్రజల గురించి ఆలోచించి తపించే చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలకు అంతా మంచే జరుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. ఐదేళ్ల రాక్షస పాలనలో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 4వ రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా రామకుప్పం మండలంలోని చల్దిగానిపల్లిలో మహిళలతో నిర్వహించిన ముఖాముఖిలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి కుప్పం నియోజకవర్గానికి వచ్చి అభివృద్ధి పనులను దగ్గరుండి చూసుకుంటానని, ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవడం నా బాధ్యత అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి రోజూ కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి గురించి అడిగి తెలుసుకుంటున్నారని, గత ప్రభుత్వం చంద్రబాబు మీద అక్కసుతో కుప్పంలో అభివృద్ధి అన్న మాట వినబడకుండా చేసిందని, ఇకపై మీకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని కుప్పం అభివృద్ధి కోసం చంద్రబాబు 40 పథకాలు తెచ్చారని తెలిపారు. ప్రతి గ్రామానికి రహదారులు, డ్రైనేజ్, అందరికీ సొంత ఇళ్లు , ఉపాధి కల్పన సహా అన్నింటిపైనా ప్రత్యేక దృష్టి పెట్టామని కుప్పం నుంచి ఇకపై వలసలు కూడా ఉండవని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ సహా అనేక పరిశ్రమలు రాబోతున్నాయని, మీకు స్థానికంగానే ఉపాధి లభిస్తుందని, ఎవరూ ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా తాము కూడా మహిళల ఆర్థిక స్వావలంబనకు పాటుబడుతున్నామని, వారి స్వయం ఉపాధికి చేయూత అందిస్తున్నామని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

రాష్ట్రంలోని మహిళలందరూ ఆర్థికశక్తిగా ఎదగాలన్నదే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని నారా భువనేశ్వరీ తెలిపారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆదివారం నాలుగో రోజు వి కోట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో హెరిటేజ్ రైతు సంక్షేమ నిధితో ఏర్పాటు చేసిన సుజల వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గత వైసిపి పాలనలో మహిళలు, ప్రజలు తమ స్వతంత్రాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు దోహదపడే విధంగా తెలుగుదేశం ప్రభుత్వం నూతన పథకాలను తీసుకురానున్నట్లు తెలిపారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు మార్కెట్ యార్డులో మూతపడిన వాటర్ ప్లాంట్ మర్మమతు చేయించి తిరిగి ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ వి కోటకు బైపాస్ రోడ్డు నిర్మాణం విషయంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ప్రజలకు, రైతులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. పలమనేరు నుండి క్రిష్ణగిరి సరిహద్దుల వరకు నాలుగు లైన్లరోడ్డు నిర్మాణంతో మండలానికి ఇచ్చిన హామీని ఈప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. పేద విద్యార్థుల ఉత్తమ విద్య కోసం త్వరలో డిగ్రీ కాలేజీ సైతం పునఃప్రారంభిస్తామన్నారు. అలాగే ఏనుగుల దాడుల వల్ల పంటలు నష్టంతో పాటు ప్రాణనష్టం జరుగుతోందని వాటి నివారణకు మదపుటేనుగులతో కట్టడి చేసే ప్రాజెక్టును అమలు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

తీరని వంటమ్మల కష్టాలు

- ఆరు నెలలుగా అందని జీతాలు
- విద్యార్థులకు అన్నం పెట్టి పస్తులుంటున్న ఆయాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఆరు నెలలుగా అందని జీతాలు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంటమ్మలకు ఆరు నెలలుగా జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. ఈ సంక్రాంతికి కూడా జీతాలు అందకపోతే వంటమ్మలు పస్తులుండాల్సిందే.. ప్రభుత్వం వంటమ్మల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికల సంఘం నాయకులు, వంటమ్మలు కోరుతున్నారు. నెలంతా కష్టపడి పనిచేస్తున్న వంటమ్మలకు ప్రభుత్వం నెలకు గౌరవేతనం ఇచ్చేది రూ.4.500లు ఇచ్చే తక్కువ జీతం కూడా చెల్లించకపోవడం దారుణం. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.5.95లు, ఉన్నత పాఠశాల రూ.8.25లు విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం ఖర్చు చేస్తున్న వంటమ్మ బిల్లులకు కూడా చెల్లించకపోవడంతో వంటమ్మ పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం పెండింగ్ జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని వంటమ్మలు కోరుతున్నారు.

తప్పని రాజకీయ వేధింపులు

అంగన్వాడీలు, సంఘమిత్రలతో పాటు వంటమ్మలకు కూడా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. రాజకీయ కక్షలతో జిల్లాలో వంటమ్మలను తొలగిస్తున్నారు. తాము చెప్పిన వారినే అంగన్వాడీ, సంఘమిత్రలు, ప్రభుత్వ పాఠశాలల్లో వంటమ్మలుగా పెట్టుకోవాలంటూ స్థానిక నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. బంగారుపాళ్యం మండలంలో పుంగోడి, కళావతి అనే వంటమ్మలను రాజకీయ ఒత్తిళ్లలో తొలగించారు. ప్రభుత్వ జీవో 108 ప్రకారం వంటమ్మలకు నెలకు రూ.11,500లు చెల్లించాలి. అయితే నెలకు రూ.4,500లు మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయమ్మల పరిస్థితి ఇతే జీతాలు అందక

జగన్న గోరు ముద్ద, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఇలా పాలకులు మారినప్పుడుల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం పేర్లు మారుతున్నా వంటమ్మల పరిస్థితి మాత్రం మారడం లేదు.. నెలల తరబడీ జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. తమ కష్టానికి తగ్గ జీతం చెల్లించాలని పోరాడుతున్న వంటమ్మలపై ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే చెప్పాలి. జిల్లాలోని 2,475 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 1,74, 524 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతన్న విద్యార్థులకు 7,867 స్వయం సహాయక సంఘాల్లో మహిళలు మధ్యాహ్న భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం వండి వడ్డిస్తున్నారు.

మరింత దారుణంగా ఉంది. వీరికి గుర్తింపు కార్డు మంజూరు చేయాలని, యూనిఫారం, సోపులు, ఫినాయిల్, గ్లౌజు, పిఎఫ్, ఈఎస్‌ఐ అమలు కావడం లేదు. సంక్రాంతి లోపు వంటమ్మలకు, ఆయమ్మలకు పెండింగ్ జీతాలు చెల్లించకంటే పండుగ పూట కూడా వరు పస్తులుండాల్సిందే. ఇకనైనా ప్రభుత్వం పెండింగ్ జీతాలు చెల్లించాలని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంటమ్మలు, ఆయమ్మలు కోరుతున్నారు.

ఆర్థికాభివృద్ధి దిశగా మహిళలు ముందడుగు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేలా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తూ చేయూతను అందిస్తోంది. ప్రభుత్వం లక్ష్యం మేరకు స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదగాలి. ఇందు కోసం బ్యాంకుల నుండీ రుణాలు అందించడంతో పాటు స్వయం ఉపాధి పెంపు కోసం శిక్షణ ఇస్తున్నాం. ఉపాధి పొందేందుకు ఉన్న అవకాశాలను చూపడం జరుగుతోందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు.

ప్రజాశక్తి : ఇటీవలే గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా సమాఖ్య 21వ వార్షికోత్సవం నిర్వహించారు. మహిళా అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డిఆర్‌డిఎ పిడి: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహం అందించడం జరుగుతోంది. జిల్లాలో పారదర్శంగా సభ్యుల అభిప్రాయం మేరకు కార్యక్రమాలు నిర్వహించేలా జిల్లా స్థాయిలో నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న సభ్యులకు నాయకత్వంలో స్థానం కల్పించాం.

ప్రజాశక్తి: స్వయం ఉపాధి కోసం ఎలాంటి సహకారం అందిస్తున్నారు..?

డిఆర్‌డిఎ పిడి: స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయం ఉపాధిలో భాగంగా వ్యాపారాల నిమిత్తం రుణాలు బ్యాంకుల ద్వారా అందించి వారికి తోడ్పాటును అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యాపారాల నిర్వహణ ద్వారా మరి కొందరికి ఉపాధి అందించవచ్చునని, రుణాలు పొందిన తరువాత సకాలంలో చెల్లించడం వల్ల అధిక మొత్తంలో రుణాలు తిరిగి పొందే అవకాశముంది.

ప్రజాశక్తి: బ్యాంకు రుణాలు చెల్లింపుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డిఆర్‌డిఎ పిడి: బ్యాంకుల నుండీ తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడం ద్వారా మరలా రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి మండలంలోని సమాఖ్య మహిళలు కలిసికట్టుగా పనిచేసి రుణాలు తిరిగి చెల్లించడంలో కృషి చేయాలి. రుణాలు తిరిగి చెల్లించడంలో ఏదైనా సమస్యలు ఉంటే మండల సమాఖ్య పరిధిలో పరిష్కరించుకోవాలి, అలా పరిష్కారం కానీ యెడల జిల్లా సమాఖ్య దృష్టికి తీసుకొచ్చేలా తీసుకురావాలని కోరుతున్నాం.

ప్రజాశక్తి: ఉమ్మడి జిల్లాలో ఎన్ని స్వయం సహాయక సంఘాలున్నాయి..?

డిఆర్‌డిఎ పిడి: జిల్లాలోని రూరల్ ప్రాంతాల్లో 68.391 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయి. రాష్ట్రంలోనే స్వయం సహాయ సంఘాల నిర్వహణ, పనితీరులో చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉంది. అనేక అవార్డులు, రివార్డులు వచ్చాయి.

ప్రజాశక్తి : స్వయం ఉపాధి కోసం ఎలాంటి పథకాలు అమలు చేస్తున్నారు..?

డిఆర్‌డిఎ పిడి: స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తోడు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, బిఎంసీల నిర్వహణ, చిరువ్యాపారాలకు ఆర్థికసాయం, వ్యక్తిగత రుణాలు, చేయూత మహిళా మార్టులు ఏర్పాటు, ప్రత్యామ్నాయ జీవనోపాధులు, హౌసింగ్ రుణాలు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటివి చేస్తున్నాం.

ముగిసిన రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు

స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా 3వ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు 2024-25 ఆదివారం ముగిశాయి. స్థానిక మురుగానిపల్లిలోని న్యూయార్క్ పాఠశాల స్కేటింగ్ క్రీడామైదానంలో నిర్వహించిన అండర్ - 4 నుంచి అండర్ - 16 స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 50 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్పీడ్ స్కేటింగ్ క్రీడా అసోసియేషన్ కార్యదర్శి, జిల్లా చీఫ్ కోచ్ కార్తీక్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈనెల 28, 29వ తేదీల్లో తిరుపతి నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. అదే విధంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ చాటిన క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 31వ తేదీతో పాటు ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 200, 400, 1000 మీటర్ల విభాగాలకు నిర్వహించిన స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన రావడం హర్షనీయమన్నారు. జిల్లా నుంచి అత్యుత్తమ స్కేటింగ్ క్రీడాకారులను తయారు చేయడమే ధ్యేయంగా తాను కోచింగ్ ఇస్తున్నట్లు కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుల ఎంపిక పోటీల పరిశీలకులు శ్రీమన్నారాయణరెడ్డి, అసిస్టెంట్ కోచ్‌లు లోక, వరుణ్ పాల్గొన్నారు.

గణితంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

విద్యాశాఖ సర్వీసెస్ లీగల్, అఫైర్స్ డీడీ అబ్రహాం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యార్థులు, ఉపాధ్యాయులు గణితంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని రాష్ట్ర విద్యాశాఖ సర్వీసెస్, లీగల్ అఫైర్స్ డిప్యూటీ డైరెక్టర్ అబ్రహాం సూచించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ ఆర్‌జెడి నాగమణి, విశిష్ట అతిథిగా తూర్పుగోదావరి జిల్లా డీఎస్‌ఈఓ వాసుదేవరావు హాజరయ్యారు. తొలుత చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం తొడతర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయిని మోహన రచించిన గణిత సాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హాజరైన అతిథులు ఇతర ముఖ్యులు గణితం విశిష్టతను వివరించారు. ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం (ఏపీఎంఎఫ్) రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మేకా సుసత్యరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ టిఎస్వీఎస్ సూర్యనారాయణ, గౌరవాధ్యక్షులు అట్ల నరసింహారెడ్డి, కార్యదర్శి గంగులపూడి భాస్కరరెడ్డి, కోశాధికారి తాత సాంబ శివరావు, ఏపీ ఎంఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు శ్రీరామ్, కార్యదర్శి రామమోహనరావు, రాష్ట్ర టెక్నికల్ కమిటీ ప్రతినిధి రవిశంకర్, గణితం ఉపాధ్యాయిని, గణిత సాహిత్యం రచయిత్రి మోహన, ఏపీ ఎంఎఫ్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

మోహన రచించిన గణిత సాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సామాజిక పురోభివృద్ధికి ఉపాధ్యాయులు మూలస్తంభాలు

యూటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న భారత దేశంలో సామాజిక అభివృద్ధికి ఉపాధ్యాయులే మూల స్తంభాలని, వారి సేవా తత్పరత, నిజాయితీ, విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత నేడు సమాజాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో యూటిఎఫ్ తిరుపతి జిల్లా శాఖ స్వర్ణోత్సవ మహాసభలు ఆ జిల్లా సంఘం అధ్యక్షులు జిజె రాజశేఖర్ అధ్యక్షతన ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చారిత్రిక నేపథ్యం, సామాజిక పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నారని, నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు పొందిన గొప్ప గొప్ప విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఉపాధ్యాయుల వద్దే చదువుకున్న వారేనని గుర్తు చేశారు. అలాంటి ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న యూటీయఫ్ స్వర్ణోత్సవాలకు శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. ఉపాధ్యాయ సమస్యలను తన దృష్టికి తెచ్చారని, వాటిని అసెంబ్లీలో ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని 16 వేల ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ చేయడానికి చర్యలు తీసుకున్నారన్నారు. ప్రారంభోపన్యాసం చేసిన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ చిన్నాభిన్న మయ్యే పరిస్థితి వచ్చిందని, గత కొంత కాలం నుండి ప్రభుత్వ పాఠశాలలో పిల్లల నమోదు తగ్గుతోందని, అనేక పాఠశాలలు మూతపడ్డాయని, వేలాది పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలే ఇందుకు కారణమని ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక స్పృహ కలిగిన యుటిఎఫ్ కార్యకర్తలు ప్రభుత్వ విధానాలను ఎండ కట్టాలని, ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ వి శేఖర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యం సాధించడానికి విద్యావ్యవస్థలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని, విద్యార్థుకు అనుగుణంగా బోధించాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి వెన్నుదన్నుగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి అమలుకు ప్రభుత్వం చొరవచూపాలని, ఇప్పటివరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన 32 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సిపిఎస్‌ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పాఠశాల విద్యా వ్యవస్థలో బోధనకు ఆటంకం కలిగిస్తున్న అనవసర యాప్ లను రద్దు చేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. అంతకు ముందు తిరుపతి బస్టాండు అంబేద్కర్ సర్కిల్ నుంచి యుటిఎఫ్ ర్యాలీ ప్రారంభమై గ్రూప్ థియేటర్ మీదుగా అక్కడి నుంచి గంగమ్మ గుడి కార్యాలయం మీదుగా కచ్చెపి ఆడిటోరియంకి చేరుకుంది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ ఎస్ నాయుడు, నవకోటేశ్వరరావు, జీవిరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, జనవిజ్ఞాన వేదిక నాయకులు బిర్లా నాయుడు, టిటిడి ఉద్యోగ సంఘాల నాయకులు మల్లారపు నాగార్జున, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, జిల్లా కార్యదర్శిలు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

మాట్లాడుతున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

835 మందికి పరికరాలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు ఉచితంగా సహాయ పరికారాలు నమోదుకు ప్రత్యేక గుర్తింపు శిబిరంలో ఆదివారం పలమనేరు మున్సిపాలిటీ, ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగింది. శిబిరాన్ని ఆర్‌డిఓ పి.భవాని, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వై.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ, ఎమ్మెల్యే యన్.అమరనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన వారందరికీ వారికి అవసరమైన సహాయ పరికరాలను ఉచితంగా గుర్తింపు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. సహాయ సంచాలకులు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల వినియోగం తప్పనిసరి అయినవారికి, అర్హతను బట్టి ఒకటి కంటే ఎక్కువ ఉపకరణాలకు గుర్తించబడునని తెలిపారు. ఈ శిబిరానికి 861 మంది హాజరు కాగా అందులో 835 మంది పరికరాలకు అర్హులు, 25మంది అనర్హులుగా ఉన్నారని తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆదివారం నగరంలోని కొంగారెడ్డిపల్లి బిటి చర్చ్, చర్చి వీధిలోని టౌన్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్నారు. మత పెద్దలు, స్థానిక క్రైస్తవులతో కలిసి కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని క్రైస్తవ సోదరి, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ ఎస్.అముద, మాజీ ఎమ్మెల్సీ బీఎన్.రాజసింహులు, కార్పొరేటర్ అశోక్ పాల్గొన్నారు.

బలిజ సంఘం నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బలిజ సంఘం నాయకులు ఓఎం.రామదాసును ఆదివారం ఆయన స్వగృహంలో చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్‌మోహన్ కలసి పరామర్శించారు. అనంతరం మంగసముద్రం హౌసింగ్ కాలనీలోని మునీశ్వరస్వామి వారి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొని స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

సంఘంతోనే అభివృద్ధి

మాజీ మంత్రి ప్రభాకర్ గౌడ్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సంఘంతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో గౌడ సంఘ రాష్ట్రకార్యదర్శి బుస నాగరాజు గౌడ్, జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి గౌడ్, ప్రధాన కార్యదర్శి తుమ్మల గోపి గౌడ్ ఆధ్వర్యంలో కార్తిక 21వ వనభోజన కార్యక్రమం జరిగింది. ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ సంఘాల అభివృద్ధితోనే ప్రజలు అభివృద్ధి చెందుతారని ప్రజల అభివృద్ధి చెందేందుకు సంఘాల ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టి, అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాత జయప్రకాష్, నారాయణ గౌడ్, సత్తిబాబు, శాంతి సుధాకర్ గౌడ్, శంకర్ రావు గౌడ్, సుధాకర్ గౌడ్, కిష్టప్ప గౌడ్, తుమ్మల చంగయ్య గౌడు, శైలజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని భారతం మిట్టలో జనసేన పార్టీ మండల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. గొడుగు చింత గ్రామపంచాయతీ సర్పంచ్ నక్కా బాబు కుమారుడు మధుసూదన్‌తో పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న పాల్గొని మాట్లాడారు. కొత్తగా పార్టీలో చేరిన యువతకు నూతన ఉత్సాహాన్ని కల్పించి, పవన్ కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను తెలియజేసి భవిష్యత్తుకు భరోసా కల్పించారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పిసిఆర్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేస్తాం..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన పిసిఆర్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పూర్వవిద్యార్థులు తెలియజేశారు. ఆదివారం స్థానిక పిసిఆర్ ఉన్నత పాఠశాలలో 1993–94 కెసిఆర్ ఉన్నత పాఠశాల బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమ విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, మురగేషన్ రామచంద్రారెడ్డి, సత్యమూర్తి విద్యార్థులతో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ పిసిఆర్ ఉన్నత పాఠశాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓ ప్రత్యేక గుర్తింపు ఉండేదని విద్యలోనూ స్పోర్ట్స్‌లోను ప్రతిభ చాటే వారన్నారు. నాడు 4వేల మంది విద్యార్థులతో కళకళలాడిన విద్యాలయం నేడు 300 మంది విద్యార్థులకు పరిమిత కావడం చాలా బాధాకరంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం పూర్వవిద్యార్థులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. 30 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పిసిఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణంలో తిరుగుతూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ గడిపారు.



చిత్తూరులో..

చౌడేపల్లి: పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనకు స్థానిక ఉన్నత పాఠశాల వేదికగా మారింది. పూర్వవిద్యార్థులు చిన్నతనంలో ఆడిపాడిన క్షణాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. 2005–06లో విద్యను అభ్యసించిన పదవ తరగతి పూర్వపు విద్యార్థులు అందరూ ఒకచోట కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యను నేర్పించిన గురువులను తొలుత ఘనంగా సన్మానించారు.

కందూరు ఉన్నత పాఠశాలలో

సోమల: మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన పూర్వవిద్యార్థులు ఆదివారం గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనాడు పాఠాలు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి వారికి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యార్థులు అందరూ కలిసి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు చేసుకొని ముచ్చట్లు చెప్పుకొని తమ కుటుంబ సభ్యులను పిల్లలను పరిచయం చేస్తూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో 60 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడేపల్లిలో.

సోమలలో..

పరీక్షల భయం వీడాలి

సైకాలజిస్ట్ డాక్టర్ బీజీ.రెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యార్థులు పరీక్షలంటే భయం విడాలని సైకాలజిస్ట్ డాక్టర్ బిజి.రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని వసతి గృహాల్లో విద్యార్థులకు పరీక్షలపై భయం వీడాలని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు వెళ్లిన వెంటనే ప్రశ్నాపత్రాలను చదవాలని, అందులో మీరు నేర్చుకున్న జవాబులను మొదట రాయాలని, తరువాత మిగతా వాటి గురించి ఆలోచించి రాసిన పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మార్గదర్శకాలను గుర్తించుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని అన్నారు. వసతిగృహ వార్డెన్లు గీత, వినాయక, విద్యార్థులు పాల్గొన్నారు.

మఠం భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- చౌడేపల్లి: జగద్గురు ఆదిశంకరాచార్యులు మఠం భవన నిర్మాణానికి ఆదివారం స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. పట్టణంలోని కుమ్మరవీధిలో గల కళ్యాణ గంగమ్మ సన్నిధాన ఆవరణంలో భవన నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. వేద పండితులు సత్యనారాయణ శర్మ, శివాలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్, దీక్షితులు సుబ్రహ్మణ్యం, అభయ ఆంజనేయస్వామి, మాజీ ఎంపీపీ రెడ్డి ప్రకాష్, పిల్లారి ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్ ప్రకాష్ పాల్గొన్నారు.

విజయరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ పరిశోధక విద్యార్థి రాచుగాళ్ల విజయరాజు యాదవ్ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ నిఫ్టీ – 50 కంపెనీస్' అంశంపై ప్రొఫెసర్ ఎం వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. కడప జిల్లా బ్రహ్మంగారి మఠంకు చెందిన విజయరాజు ప్రస్తుతం హైదరాబాదులో చార్టెడ్ అకౌంట్ గా పనిచేస్తున్నారు. వీరి తండ్రి రాచుగాళ్ల పెంచలయ్య హెడ్మాస్టర్‌గా పనిచేశారు. తల్లి నారాయణమ్మ. తన పరిశోధనా కాలంలో విజయ రాజు యాదవ్, పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. వీరు రూపొందించిన ఆరు పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, ఇతర అధ్యాపకులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

మంజునాథ్‌కు అబ్దుల్ కలాం గురు పురస్కార్ అవార్డు

ప్రజాశక్తి - రామకుప్పం: తమిళనాడులో వేలమ్మాల్ వేల్స్ విద్యాలయ సిబియస్‌ఇ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా ఉన్న రామకుప్పం వాసి మంజునాథ్‌కు మరో అవార్డ్ లభించింది. ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించి తన విద్యార్థులు నేషనల్ లెవెల్‌లో వివిధ ఒలింపియాడ్ ఎగ్జామ్స్‌లో ఉతీర్ణతను సాధించారు. రీచార్జ్ బ్యాటరీ పితామహుడు డాక్టర్ చివుకుల హనుమంతరావు ఛారిటబుల్ ట్రస్టు, సుగుణ సైన్సు అకాడమి గుంటూరు వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 14వ రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక అవార్డులను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభా, సామాజిక సేవలను అందించిన వారికి భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం పేరుతో ఏటా ఈ అవార్డులను ఇవ్వనున్నారు. విశిష్ట సేవా పురస్కార్, సేవా పురస్కార్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన్ గురు పురస్కార్, గురు పురస్కార్, ఇన్ఫర్మేషన్ విభాగాల్లో ట్రస్ట్ 14వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి అవార్డులను ఆదివారం అందించారు. గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో అందించే ఈ అవార్డు ప్రధానోత్సవంలో ఉపాధ్యాయుడు మంజునాథ్‌కి 'గురు పురస్కార్' కేటగిరీలో దక్కింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డాక్టర్ కె.రామమోహనరావు ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో), ఇస్రో శాస్త్రవేత్తలు, నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు పాల్గొన్నారు.

'అధికారులు వేధింపులు మానుకోవాలి'



ప్రజాశక్తి- కుప్పం టౌన్: ద్రవిడ విశ్వవిద్యాలయ అధికారులు అనవసరపు వేధింపులు మానుకోవాలని కోరుతూ భాగ్యలక్ష్మి పాత్రికేయులకు సంప్రదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొంతకాలంగా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు తనపై అనవసరపు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సుమారు 17 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయంలో తను అటెండర్‌గా పనిచేస్తున్నానని, గతంలో విశ్వవిద్యాలయ పరిధిలో అవుట్సోర్సింగ్ సిబ్బంది వేతనాల కోసం సమ్మె నిర్వహించిన సంగతి తెలిసిందేనని, అవుట్సోర్సింగ్ సిబ్బంది సమ్మెలో ఉండగా తాను మాత్రం విధులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కొంతమంది తనపై దాడి చేయగా, న్యాయం కోరుతూ తను పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆనాడు ఇచ్చిన ఫిర్యాదును నేడు వాపసు తీసుకోవాలంటూ అధికారులు నివేదిస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో తమిళ విభాగంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న తనను ఇంజనీరింగ్ విభాగానికి మార్చినట్టు అధికారులు తెలిపారని, తన విధులలో భాగంగా ఇంజనీరింగ్ విభాగానికి వెళ్లిన తనను స్వీపర్‌గా కానీ, గార్డెన్‌గా కానీ విధులు నిర్వహించాల్సిందిగా అధికారులు ఆదేశించినట్లు తెలిపారు. ఇదెక్కడి న్యాయమని అధికారులను ప్రశ్నించగా అటెండర్ స్థాయి విద్యార్హత తనకు లేదని, అందుకే విధులను మారుస్తున్నట్టు అధికారులు చెప్పినట్టు తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా 14 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న విధుల నుండి తొలగిస్తూ, అంతకంటే కింది స్థాయి ఉద్యోగాన్ని కల్పించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. కనీసం అధికారులు తన సర్వీసును దృష్టిలో ఉంచుకొని పదవ తరగతి ఉత్తీర్ణత సాధించడానికి తనకు గడువు ఇప్పించాలని కోరుతున్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడిపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడు పై పీడీ యాక్ట్ అమలు చేస్తున్నామని, ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారికైనా కఠిన శిక్షలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు హెచ్చరించారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో వైయస్సార్ కడప జిల్లాకు చెందిన షేక్ చంపతీ జాకీర్ 8 సార్లు నిందితులుగా నిరూపణకు గురయ్యారన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో బలమైన సాక్షాధారులను సేకరించి నిందితులకు కఠిన శిక్ష పడేలా కార్యచరణ రూపొందించామన్నారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు సిఫార్సు మేరకు కడప కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పీడీ యాక్ట్ అమలకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉత్తర్వుల అమలులో భాగంగా కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. ఇప్పటికే ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో కొంత మంది ఐదేళ్ల కారాగార శిక్షలకు గురై జైలు జీవితం గడుపుతున్నారని, అరుదైన ఎర్రచందనం వృక్ష సంపదను కాపాడటానికి ఎంతటి వారిపైనైనా ఉక్కు పాదం మోపుతామని తిరుపతి ఎస్పి సుబ్బరాయుడు హెచ్చరించారు.

క్రైం న్యూస్

1800 లీటర్ల సారా ఊట ధ్వంసం: సీఐ

ఐదుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం ఎక్సైజ్ పరిధిలోని నాలుగు మండలాలలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన వారి వివరాలను ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని ఎక్సైజ్ సీఐ నాగరాజా కోరారు. నేరస్తుల గురించి తెలియజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆదివారం వారు చిత్తూరు జిల్లా ఈఎస్‌టిఎఫ్ సిబ్బందితో కలిసి కుప్పం నియోజకవర్గ పరిధిలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో భాగంగా శాంతిపురం మండలం బోయనపల్లి గ్రామానికి చెందిన కృష్ణప్ప మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద కర్ణాటక మద్యం ప్యాకెట్లు అమ్ముతుండటాన్ని గుర్తించామన్నారు. అతని వద్ద నుంచి 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, అతనిని అదుపులోనికి తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే కుప్పం మండలం మోట్లచేను అటవీ ప్రాంతంలో నాటు సారా పావరాలపై దాడులు చేసి, 600 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈనెల 16వ తేదీ నుండి ఎక్సైజ్ పరిధిలో నిర్వహించిన దాడులలో మొత్తం 7కేసులు నమోదు చేసి, 5మందిని అదుపులోనికి తీసుకున్నామని వీరి వద్ద నుంచి 132 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, 1200 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్‌శాఖ కుప్పం ఎస్సై మోహన్ బాబు, ఈఎస్‌టిఎఫ్ చిత్తూరు ఎస్సై అశోక్ కుమార్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

28 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు/ వెదురుకుప్పం : గంగాధర నెల్లూరు మండలం ఆవలకొండ గ్రామంలో ఆదివారం సీఐ వాసంతి ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సర్చ్‌లో ఏలాంటి రికార్డులు లేని 28 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించిన రికార్డులు లేని ద్విచక్ర వాహనాలపై అనుమానంతో విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు వాహనాలకు ఒకే నంబర్

వాహనాలను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి- కార్వేటినగరం: రెండు వాహనాలకు ఒకే నంబర్ ఉన్నట్లు వాహన తనిఖీలో గుర్తించినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై అమ్మపల్లి క్రాస్ వద్ద సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఏపీ జీరో4వి–5035 నంబర్‌తో రెండు టాటా ఏసీ గూడ్స్ క్యారియర్ వాహనాలు ముందు వెనుక రావడంతో అనుమానించి వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. వాహనాలకు సంబంధించిన యజమాని కార్వేటినగరం మండలం, ఈదువారిపల్లి గ్రామానికి చెందిన ఎ.హేమకుమార్‌ను విచారించడంతో పోలీసుల చలానాల నుంచి తప్పించుకోవడానికి ఆ యజమాని ఒక వాహనానికి ఉన్న రికార్డులతో రెండు వాహనలను నడుపుతున్నట్లు అంగీకరించినట్లు తెలిపారు. దీంతో ఆ రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని, జిల్లా మోటార్ వెహికల్స్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఏఎస్ఐ, హోంగార్డు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- కార్వేటినగరం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 7 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి హరిజనవాడలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఎళుమలైరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి దళితవాడకు చెందిన ఆరుముగం అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచార మేరకు సిబ్బందితో కలిసి ఆరుముగం నిర్వహిస్తున్న చిల్లర అంగడిపై దాడులు నిర్వహించగా అతని వద్ద ఉన్న 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మట్టి దొంగలకు అడ్డేది?

- యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వరుస తుపానుల వల్ల నదులు, ఏరులు, కాలువల్లో ఆ గట్టు నుంచి ఈ గట్టు వరకు నీటి నిల్వలు ఉన్నాయి. ఫలితంగా అక్రమార్కుల కన్ను ఇసుక నుంచి ఎర్రగుళ్ల(గ్రావెల్)పై పడింది. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్న చందాన కొందరు కూటమి నేతలు తమ జేబులు నింపుకునేందుకు అక్రమ వ్యాపారాన్ని గ్రావెల్ తవ్వకాలపై మళ్లించారు. ఈ క్రమంలో తొట్టంబేడు మండలంలోని తాటిపర్తి, కల్లిపూడి, తంగేళ్లపాలెం ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఎర్ర గ్రావెల్ నిక్షేపాలను కొందరు కూటమి నేతలు పగలూ రాత్రీ తేడా లేకుండా తవ్వేస్తున్నారు. జేసీబీలతో తవ్వి భారీ టిప్పర్ల సాయంతో ప్రైవేటు లే-అవుట్లు, పరిశ్రమలు, ప్లాట్ల యజమానులకు విక్రయిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత నెల 22న తెలుగంగ జేఈ అనిత కల్లిపూడి వద్దనున్న తెలుగు గంగ కాలువ వెంబడి గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారని రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేకుండా పోయింది. దీంతో దొంగలు రెచ్చిపోతూ గ్రావెల్ నిక్షేపాలను కొళ్లగొట్టేస్తూ జేబులు నింపేసుకుంటున్నారు. ఇదంతా విజిలెన్స్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగానికి తెలిసినా అధికారపార్టీ నేతలతో మనకెందుకులేనని నిద్ర నటిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎర్ర దొంగలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఎస్వీయూలో క్షుద్ర పూజలా?

భయాందోళనలో సిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి -క్యాంపస్

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థుల వసతి భవనాలు, సిబ్బంది నివాస ప్రాంతాల సమీపంలో కొంతమంది బయట వ్యక్తులు వచ్చి క్షుద్ర పూజలు చేస్తున్నారని విద్యార్థులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్షుద్ర పూజలలో పసువు, కుంకుమ, పూలు, కోడిని కోసి నడిరోడ్డున పడేయడంతో క్యాంపస్ లో విద్యార్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భద్రతా సిబ్బంది కొరతతో బయట వ్యక్తులు క్యాంపస్ లో ఇలాంటి అనైతిక, అసాంఘిక కార్యక్రమాలు చేస్తుండటం దారుణమని విద్యార్థులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్ పరిసరాల్లో నివసించే విద్యార్థులు, పరిశోధకులు, సిబ్బందికి ఎటువంటి భద్రత లేదని వారు వాపోతున్నారు. ఇలాంటి క్షుద్ర పూజల వల్ల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆలోచించి వర్సిటీ విద్యార్థులకు, సిబ్బందికి కట్టుదిట్టమైన భద్రత సిబ్బందిని పెంచి భద్రత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION) : PUTTUR
I.P.No. 16 OF 2023

Between:
Tangella Narendra ....Petitioner/Debtor
And:
K.Sasi Kumar Reddy and others ....Respondents/Creditors

To
Respondent No.1
K.Sasi Kumar Reddy, Son of K.Tirumala Reddy, D.No.9-106-3, residing at Mambedu Village and Post, Vedurukuppam Mandal, Chittoor District, A.P.

NOTICE TO THE RESPONDENT No.1

Please take Notice that the above petition filed by the petitioner against you on the file of the Hon'ble Civil Judge (Senior Division), Puttur. The said case is posted for your notice on 08.01.2025. If you failed to appear in person or through an Advocate on 08.01.2025 at 10.30 A.M before the said Court, thus the matter will be decided as ex-parte.
This is the order of the Hon'ble Court.

SRI B.V.CHALAPATHI, B.Sc.,B.L.,
ADVOCATE FOR PETITIONER

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION) : PUTTUR
I.P.No.16 OF 2023

Between:
Tangella Narendra ...Petitioner/Debtor
And:
K. Sasi Kumar Reddy and others ...Respondents/Creditors

To
Respondent No.3
D. Pradeep Son of D.Subramanyam, residing at Bandikindooru Village, Mambedu Post, Vedurukuppam Mandal, Chittoor District, A.P.

NOTICE TO THE RESPONDENT No.3

Please take Notice that the above petition filed by the petitioner against you on the file of the Hon'ble Civil Judge (Senior Division), Puttur. The said case is"posted for your notice on 08.01.2025. If you failed to appear in person or through an Advocate on 08.01.2025 at 10.30 A.M before the said Court, thus the matter will be decided as ex-parte.
This is the order of the Hon'ble Court.

SRI B.V.CHALAPATHI, B.Sc.,B.L.,
ADVOCATE FOR PETITIONER